సాక్షి సిద్దిపేట

బుధవారం। 20। నవంబర్। 2024

దీపోత్సవానికి హాజరైన మహిళలు



న్యూస్‌రీల్

పీజీ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట (స్వయం ప్రతిపత్తి)లో పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఎమ్మెస్సీ బాటని, జువాలజీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎం.కామ్, ఎంఏ తెలుగు, హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ విభాగాలలోని పీజీ కోర్సులలో మిగిలిన సీట్లకు ఈ నెల 22న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ అయోధ్యలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 22న స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో సంప్రదించాలన్నారు.

మధుమేహ వ్యాధి నియంత్రణ మనచేతుల్లోనే..

సిద్దిపేట ఎడ్యుకేషన్: రోజువారి దినచర్యలతో మధుమేహ వ్యాధిని నియంత్రించవచ్చని ప్రభుత్వ వైద్య కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో మధుమేహం వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్ దేశం మాట్లాడుతూ వంశ పారంపర్యంగా, ఆహారపు అలవాట్ల ద్వారా మధుమేహ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది మధుమేహం బారీన పడుతున్నారన్నారు. మధుమేహ వ్యాధి గ్రస్తులు రిఫైండ్ ఆహార పదార్థాలు, ఉడికించిన దుంపలు తినకూడదని సూచించారు. సరైన మందులు, దినచర్యలో మార్పులు తీసుకురావడం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నేహిక, మెడిసిన్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శతావధానం



శతావధానంలో పాల్గొన్న కవులు, పండితులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అవధానాలతో పద్య, విద్య అభివృద్ధి చెందుతుందని, ప్రముఖ కవి, పండితులు దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. సిద్దిపేట హరిహర రెసిడెన్సిలోని శ్రీలలితా చంద్రమౌళీశ్వర ఆలయ వార్షికోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా పండరి రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన శతావధానం అలరించింది. ముఖ్య అతిథిగా హాజరైన పండితులు దోర్బల ప్రభాకరశర్మ మాట్లాడుతూ పద్యం రసనైవేద్యం అన్నారు. పద్య కవిత్వం మధురంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉమాపతి రామ శర్మ, ఉజ్జయిని మహాకాళేశ్వరరావు, వరుకోలు లక్ష్మయ్య, భ్రమరాంబిక, బిట్టు బాబు, కట్టా రంజిత్ కుమార్, తాటికొండ శివ కుమార శర్మ, చొప్పదండి సుధాకర్, వైభవి మొదలైన పృచ్ఛకులు పాల్గొన్నారు.

ఆరుబయట చెత్తవేస్తే జరిమానా



పార్కును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేట మనందరి లక్ష్యమని, ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మంగళవారం పట్టణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చెత్తను వేరుచేసి ఇవ్వకుండా అంతా కలిపి ఇవ్వడంతో ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆస్పత్రికి రూ.50 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో తడి, పొడి, హానికర చెత్త అని మూడు రకాలుగా విభజన చేసి పారిశుద్ధ్య కార్మికులకు, చెత్త సేకరణ వాహనాలకు ఇవ్వాలని సూచించారు. ఆరుబయట చెత్తే వేస్తే జరిమానా తప్పదన్నారు. రెండు సార్లు ఆస్పత్రి అధికారులను హెచ్చరించినా మార్పు రాలేదని దీనితో జరిమానా విధించాల్సి వచ్చిందన్నారు. అంతకుముందు మైత్రి వనంలోని పిల్లల పార్క్ పరిశీలించి మరమ్మతులు చేయాలని సూచించారు. మొక్కలకు ప్రతి రోజు నీరు పట్టాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





వైభవం.. దీపోత్సవం

కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ముఖ మండపంలో కార్తీక దీపోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)

కోమటిచెరువులో కోటి కాంతులు

కోమటిచెరువు కార్తీక దీపాలతో దేదీప్యమానంగా వెలిగింది. మంగళవారం రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు వీరధర్మ పీఠాధిపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు శివకేశవులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం కోమటి చెరువులో దీపాలను వదిలి భక్తి శ్రద్ధలతో గంగాదేవికి నమస్కరించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు.

–సిద్దిపేటజోన్



కోమటిచెరువులో దీపాలను వదులుతున్న మహిళలు

చేతులెత్తేసిన.. చేపల కాంట్రాక్టర్లు



టెండర్లకు స్పందన కరువు

- మూడుసార్లు గడువు పొడిగించినా స్పందన నిల్
- 1,715 చెరువుల్లో 2.21కోట్ల చేపపిల్లల పంపిణీకి నిర్ణయం
- నగదు ఇస్తేనే మేలంటున్న మత్స్యకారులు

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ కార్యక్రమం ముందుకు సాగడంలేదు. పంపిణీ చేసేందుకు ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లు ఒక్కొక్కరుగా చేతులెత్తేస్తుండటమే ఇందుకు కారణం. గత ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది సైతం 1,715 చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు 2.21కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని మత్స్యశాఖ నిర్ణయించింది. గత నెలలో పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. మధ్యలోనే కాంట్రాక్టర్లు చేప పిల్లలు పంపిణీ చేయలేం అని వెళ్లిపోతున్నారు. ఇదిలాఉంటే చేప పిల్లలకు బదులుగా నగదును అందజేయాలని పలువురు మత్స్యకారులు కోరుతున్నారు.



శనిగరం రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదులుతున్న మంత్రి పొన్నం, కలెక్టర్ తదితరులు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: మత్స్యకారులకు చేయూతను అందించేందుకు ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఈ ఏడాది పంపిణీ చేసేందుకు మత్స్య శాఖ కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానించారు. మొదటి సారి జూలై 23వ తేదీ వరకు టెండర్లు ఆహ్వానించగా ఎవరు ముందుకు రాలేదు. దీంతో గడువును ఆగస్టు 2వ తేదీ వరకు పొడిగించారు. అయినప్పటికీ ఎవరు ముందుకు రాకపోవడంతో మళ్లీ ఆగస్టు 13వ తేదీ వరకు పొడిగించారు. ఇద్దరు కాంట్రాక్టర్లు ముందుకురాగా వారికి చేప పిల్లల ఫాం లేకపోవడంతో వారు అనర్హులయ్యారు.

ఇంకా 2.08 కోట్ల చేప పిల్లలు..

గత ఏడాది 4.41కోట్ల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సారి ప్రభుత్వం కోత పెట్టి 2.21కోట్ల చేప పిల్లలు మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. అందులో 35 నుంచి 40ఎంఎం చేప పిల్లలు 84.35లక్షలు, 80 నుంచి 100ఎంఎం 1,31,92,000 పంపిణీ చేయాలనుకున్నారు. కానీ ఇప్పటి వరకు 25 చెరువుల్లో 12.34లక్షల చేప పిల్లలను మాత్రమే వదిలారు. ఇంకా సుమారుగా 2.08 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాల్సి ఉంది.

నగదు ఇవ్వాలి

చేప పిల్లలు వదిలేందుకు అదను దాటిపోయిందని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. తమ సొంత డబ్బులతో ప్రైవేట్ ఫిష్ ఫాంలో కొనుగోలు చేసి పెంచుతున్నామని తెలిపారు. ప్రతి ఏడాది అక్టోబర్ మొదటి వారంలోనే చేప పిల్లల పంపిణీ పూర్తయ్యేది. నవంబర్ 19వ తేదీ వచ్చినా ఇప్పటి వరకు పంపిణీ ఐదు శాతం మాత్రమే జరిగింది. సదరు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని పంపిణీ చేయని చెరువులకు సంబంధించి నగదును సొసైటీలకు అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మరో కాంట్రాక్టర్‌కు అప్పగింత

ఇతర జిల్లాల్లో పంపిణీ చేస్తున్న కాంట్రాక్టర్ లక్ష్మీనరసింహ ఫిష్ సీడ్ సప్లయర్స్‌కు జిల్లాకు సరఫరా చేసే బాధ్యతలు సైతం అప్పగించారు. సుమారు 6 లక్షల వరకు చేప పిల్లలను పంపిణీ చేసి.. సీడ్ లేదని సరఫరా చేయలేను అని చెప్పారు. దీంతో మరో కాంట్రాక్టర్ సూర్య అయ్యప్పకు అప్పగించారు. అతను ఇప్పటి వరకు 6.34లక్షల చేప పిల్లలు మాత్రమే సరఫరా చేశారు. రెండోసారి నియమించిన కాంట్రాక్టర్ పంపిణీ చేయడం లేదని ఇటీవల డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌కు జిల్లా మత్స్యశాఖ అధికారి లేఖను రాశారు. మరో కాంట్రాక్టర్‌ను నియమించాలని లేఖలో పేర్కొన్నారు.

నగదు ఇస్తేనే మేలు..



చేప పిల్లలు అక్టోబర్ మొదటి వారం వరకు పంపిణీ చేస్తే మార్చి వరకు కిలో వరకు బరువు పెరిగేవి. ఇంకా చేప పిల్లల పంపిణీ చేయకపోవడంతో మత్స్య కారుల జీవనోపాధికి గండిపడింది. చేప పిల్లలకు బదులు నగదును సొసైటీలకు అందించి మత్స్యకారులను ఆదుకోవాలి.

–తుపాకుల బాలరంగం, మత్స్య సొసైటీ జిల్లా చీఫ్ ప్రమోటర్

కాంట్రాక్టర్ కోసం లేఖ రాశా



జిల్లాలో టెండర్లు మూడు మార్లు పిలిచాం. ఇద్దరు వచ్చారు. ఫీల్డ్‌లో విచారణ చేస్తే అనర్హులయ్యారు. దీంతో ఇతర జిల్లాల్లో సరఫరా చేసే వారిని ఫిషరీస్ డైరెక్టర్ అలాట్ చేశారు. కాంట్రాక్టర్ పంపిణీ చేయకపోవడంతో మరొకరిని నియమించాలని లేఖ రాశాం. ఉన్నత అధికారుల ఆదేశిస్తే అమలు చేస్తాం.

– వరదారెడ్డి, ఎఫ్‌డీఓ

భూసేకరణలో ఎవరినీ నొప్పించం

- నిర్బంధాలు, దౌర్జన్యాలు ఉండవు
- పరిశ్రమలకు రైతులు సహకరించాలి
- సహకార సంఘాల అభివృద్ధికి కృషి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ ఏర్పాటుకు కావాల్సిన భూ సేకరణ విషయంలో రైతులు సహకరించాలని, నిర్బంధాలు, దౌర్జన్యాలు ఉండవని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. హుస్నాబాద్ విశాల సహకార పరపతి సంఘం నూతన కార్యాలయం భవనం, 1200 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల నూతనంగా నిర్మించిన గోదాంను మంగళవారం మంత్రి ప్రారంభించారు. సంఘం వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంతారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ లక్ష్మీకాంతారావు సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. హుస్నాబాద్ సహకార సంఘాన్ని అనేక రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. సంఘం ఆధ్వర్యంలో రైస్‌మిల్లు, విత్తనోత్పత్తి కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఈ సంఘం ద్వారా రూ.504 కోట్లు రుణ మాఫీ జరిగిందని, ఇంకా 204 మందికి రుణ మాఫీ జరగాల్సి ఉందని తెలిపారు.

చౌటపల్లిలో వ్యవసాయాధారిత పరిశ్రమలు

గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన కాలువల నిర్మాణాలకు భూ సేకరణ కోసం అధికారులు గ్రామ సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులను నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేద్దామన్నారు. కాలువల కోసం రైతులు సహకరించాలన్నారు. కాలువల డిజైన్ చేసింది తాము కాదని, ఇంజనీర్ల సూచనల ద్వారానే కాలువల అలైన్మెంట్ జరుగుతుందన్నారు. పారిశ్రామిక కారిడార్ తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కాలుష్యాన్ని వెదజల్లె పరిశ్రమలు కాకుండా వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, కరీంనగర్ జిల్లా సహకార సంఘం అధ్యక్షుడు కొండూరి రవీందర్, తెలంగాణ కో ఆపరేటివ్ యూనియన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత పాల్గొన్నారు.



బొప్పరాజు లక్ష్మీకాంతారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మార్కెట్ రేటుకు మూడింతల పరిహారం

ముంపునకు గురవుతున్న రైతులతో ఆర్డీఓ రామ్మూర్తి

కోహెడరూరల్(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు ఎలా పరిహారం చెల్లించమో అలాగే కెనాల్‌లో భూములు కోల్పోతున్న వారికీ మార్కెట్ విలువకు మూడింతల పరిహారం అందిస్తున్నట్లు ఆర్డీవో రామ్మూర్తి అన్నారు. మండలంలోని కూరెల్ల గ్రామంలో గౌరవెల్లి ప్రాజెక్టు కెనాల్ కాలువ భూసేకరణ కోసం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరెల్ల గ్రామ పరిధిలో 11ఎకారల 30గుంటల భూమి అవసరం ఉందన్నారు. భూసేకరణకు ప్రతి రైతు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భూసేకరణ డీటీ అరవింద్, ఆర్ఐ ఎల్లయ్య, ఇరిగేషన్ ఈఈ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోటీ పరీక్షల అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆడిట్ అధికారి జయశ్రీ అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో జయశ్రీ పాల్గొని మాట్లాడారు. తాను 24 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి, గ్రూప్స్ రాసి జిల్లా ఆడిట్ ఆఫీసర్ గా నియమితులైనట్లు తెలిపారు. పోటీ పరీక్షల అభ్యర్థులు, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఆడిట్ అధికారిని గ్రంథాలయ ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

గజ్వేల్ కాంగ్రెస్‌లో మళ్లీ విభేదాలు



గజ్వేల్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

రెండు గ్రూపులుగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు

గజ్వేల్: ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లోనూ కాంగ్రెస్ గ్రూపు విభేదాలు మరోసారి బయటపడ్డాయి. మంగళవారం డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో ముందుగా పార్టీ శ్రేణులు పట్టణంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌తోపాటు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా అసమ్మతి నేత బందారు శ్రీకాంత్‌రావు సైతం తన వర్గంతో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించడంతోపాటు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

కొనుగోళ్లలో అక్రమాలు సహించం

- 14లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం సేకరణ
- రెండు, మూడ్రోజుల్లోనే రైతులకు చెల్లింపులు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్
- గజ్వేల్‌లో కొనుగోలు కేంద్రం పరిశీలన

గజ్వేల్: ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు సహించబోమని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 14లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యాన్ని సేకరించామన్నారు. రెండుమూడ్రోజుల్లో రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మంగళవారం గజ్వేల్ మార్కెట్ యార్డులో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు బాబుతో మాట్లాడారు. కేంద్రం నిర్వాహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతేకాకుండా ధాన్యం అమ్ముకోవడానికి కేంద్రానికి వచ్చిన ముట్రాజ్‌పల్లి రైతు రాయగిరి యాదగిరితో మాట్లాడారు. తేమశాతం చూసుకొని, జల్లి పట్టుకొని ధాన్యం తీసుకొచ్చానని చెప్పడంతో కమిషర్ సంతోషం వ్యక్తం చేశారు. ఆ రైతుకున్న అవగాహనను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తున్నామని చెప్పారు. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ కూడా వేస్తున్నామని, ఇప్పటికే రూ.15కోట్ల చెల్లింపులు జరిగాయన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు

కొండపాక(గజ్వేల్): ధాన్యాన్ని దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. దుద్దెడలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. అలాగే ధాన్యం తీసుకువచ్చిన రైతులతో అడిగి సమస్యలు తెలుసుకున్నారు.



గజ్వేల్ కొనుగోలు కేంద్రంలో వడ్ల నాణ్యతను పరిశీలిస్తున్న డీఎస్ చౌహాన్, చిత్రంలో కలెక్టర్

ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

సిద్దిపేటరూరల్: కలెక్టరేట్‌లో కలెక్టర్ మనుచౌదరితో కలిసి డీఎస్ చౌహాన్ వరిధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.171 కోట్ల 56 లక్షల విలువైన 73,947 మెట్రిక్ టన్నుల వరిధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ప్రచార వాహనం ప్రారంభం...

ప్రజా పాలన– ప్రజా విజయోత్సవాల సందర్భంగా రూపొందించిన ప్రజా పాలన కళాయాత్ర వాహనాలను మంగళవారం డీఎస్. చౌహాన్ కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీపీఆర్ రవికుమార్, డీపీఆర్‌ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎస్ చౌహాన్, కలెక్టర్

క్లుప్తంగా

'సాదత్ అలీ'కి టీచర్స్ ఇన్‌స్పిరేషన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న హెచ్ఎం సాదత్ అలీ

దుబ్బాక: శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో విద్యా వ్యవస్థలో విసూత్నమైన పాత్రను పోషించే ఉపాధ్యాయులకు ఇచ్చే టీచర్స్ ఇన్‌స్పిరేషన్ 2024 అవార్డును దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సాదత్ అలీ అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వీసీ ఉమేశ్ కుమార్ చేతుల మీదుగా ప్రధానం చేయడంతోపాటు ఘనంగా సత్కరించారు. సాదత్ అలీ పదేళ్లుగా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో అనేక అవార్డులను పొందారు. ప్రస్తుతం సాదత్ అలీ రాష్ట్ర రిసోర్స్ పర్సన్‌గా కొనసాగుతున్నారు. అవార్డు రావడంపై ఎంఈఓ ప్రభుదాసు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువు మరో వారం రోజులు పొడిగించారు. గడువు తేదీ మంగళవారం ముగియాల్సి ఉండగా, 26 వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఆదేశాలు జారీ చేసిందని ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉమ్మడి జిల్లాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోక్సో కేసులో ఏడేళ్లు జైలు

రూ.20 వేలు జరిమానా

మెదక్ మున్సిపాలిటీ: పోక్సో కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్షతోపాటు జరిమానా పడినట్లు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మెదక్ పట్టణానికి చెందిన ఓ మైనర్ విద్యార్థిపై నిందితుడైన ఆమె మేనమామ(అమ్మ సోదరుడు) ఒగ్గు శ్రీనివాస్ ఏడాది కాలంగా ఆకృత్యానికి పాల్పడినట్లు తేలిందన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇటీవల కేసు నమోదు చేసి నిందితుడైన శ్రీనివాస్‌ను కోర్టుకు హాజరు పర్చగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు త్వరితగతిన పరిష్కారం అయ్యేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బంది జిల్లా ఎస్పీ అభినందించారు.

భూ తగాదాలో ముగ్గురిపై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్): భూ తగాదాలో ముగ్గురిపై కేసు నమోదైంది. ఈ ఘటన అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ముత్తినేని వెంకటేశ్వరరావు, మాధవరావు ఇద్దరు అన్నాదమ్ముళ్లు. వీరిద్దరి మధ్య కొద్ది రోజులుగా భూ తగాద కొనసాగుతుంది. రెండ్రోజుల కిందట వెంకటేశ్వరరావు వ్యవసాయ పొలం వద్ద పని చేస్తుండగా మాధవరావు అతడి భార్య, కుమారుడు కలిసి దాడి చేసినట్లు వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విదేశీయుల వివరాలు నమోదు చేయాలి

హోటళ్లు, లాడ్జిలు, రిసార్ట్‌లకు సీపీ హెచ్చరిక

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు, లాడ్జిలు, రిసార్ట్‌లలో బస చేయడానికి వచ్చే విదేశీయుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. విదేశీయుల పూర్తి వివరాలు, వారు ఎక్కడి నుంచి, ఎందుకొచ్చారు అనే వివరాలు నమోదు చేయాలని సూచించారు. నమోదు చేయని నిర్వాహకులపై 1946 విదేశీయుల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

పథకాలతో ఆర్థికంగా ఎదగాలి

- త్వరలో విదేశీ జాబ్ కోసం మహిళలకు ప్రత్యేక క్యాంప్
- మంత్రి పొన్నం ప్రభాకర్
- హుస్నాబాద్‌కు త్వరలో 50 సెట్విన్ ఆటోలు : ఛైర్మన్ గిరిధర్ రెడ్డి
- సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రం ప్రారంభం


హుస్నాబాద్‌లో సెట్విన్ శిక్షణా కేంద్రంలో కుట్టు మిషన్‌తో మంత్రి పొన్నం, తదితరులు

హుస్నాబాద్: ప్రతీ మహిళ ఏదో ఒక ప్రభుత్వ పథకంతో లబ్ధి పొంది ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కాంప్లెక్స్‌లో సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సెట్విన్ శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్, బ్యూటీషన్, కంప్యూటర్ ల్యాబ్, ఐటీఐ మెకానిక్స్ ఎంఎస్ అకౌంటెంట్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. మహిళలు ఇంట్లోనే కూర్చొని ఆదాయం పెంచుకోవడానికి వివిధ రకాలుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేసుకోవడానికి అధికారికంగా టామ్ కామ్ కంపెనీ ద్వారా త్వరలో క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలకు ట్యాక్స్ లేకుండా చూశామని, సోమవారం ఒక్కరోజే 113 ఈవీ వాహనాలకు రిజిస్ట్రేషన్ అయ్యాయని తెలిపారు.

కళాయాత్ర వాహనాల ప్రారంభం..

ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాయాత్ర వాహనాలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఏడాది కాలంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను డిసెంబర్ 7 వరకు గ్రామ గ్రామాన ప్రచారం చేయడానికి ప్రభుత్వ పక్షాన 33 జిల్లాల్లో ఇలాంటి వాహనాల ద్వారా అవగాహన కల్పిస్తామన్నారు. అలాగే మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతి సందర్భంగా పట్టణంలోని బుడగ జంగాల కాలనీలో ఇందిరా గాంధీ విగ్రహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.

నైపుణ్యం పెంచడానికి శిక్షణ కేంద్రం

యువతకు నైపుణ్యం పెంచడానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని సెట్విన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి అన్నారు. జంట నగరాల్లోనే కాకుండా తెలంగాణలో కూడా సెట్విన్ కేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 23 శిక్షణ కేంద్రాలు ఉన్నాయని, మరో 5 కేంద్రాలు రాబోతున్నాయని తెలిపారు. త్వరలో జహీరాబాద్, హుస్నాబాద్‌కు 50 చొప్పున సెట్విన్ ఆటోలను ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మోహన్ రెడ్డి, సెట్విన్ ఎండీ వేణు గోపాల్, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ ఛైర్‌పర్సన్ అయిలేని అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమై.. పత్తి చేనులో శవమై

భార్యతో గొడవపడి వ్యక్తి ఆత్మహత్య


బక్కప్ప (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన వ్యక్తి నాలుగు రోజుల తర్వాత పత్తి చేనులో శవమై తేలాడు. ఈ ఘటన మంగళవారం అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం మేరకు.. చేవెళ్ల గ్రామానికి చెందిన బక్కప్ప (38) 15న భార్యతో గొడవపడి రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు చుట్టుపక్కల గ్రామాలతోపాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య రుక్మిణి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశాం. గ్రామ శివారులోని సంతోష్ అనే వ్యక్తి పత్తి చేనులో మంగళవారం కూలీలు పత్తి ఏరడానికి వెళ్లగా బక్కప్ప మృతదేహం కనిపించింది. వెంటనే కుటుంబీకులకు తెలియజేశారు. భార్య రుక్మిణి వేధించడం, తరచూ గొడవ పడుతూ తల్లిగారింటికి వెళ్లి పోతుందని సూసైడ్ నోట్ జేబులో దొరికింది. పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు అనుమానం ఉందని ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. అదృశ్యం కేసును ఆత్మహత్య కేసుగా నమోదు చేశామన్నారు.

పురుగుల మందు తాగి రైతు

గజ్వేల్‌రూరల్: పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని జాలిగామలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎక్కాల స్వామి(43)కి భార్య కనకవ్వ దంపతులు తమకున్న పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులకు గురైన స్వామి మద్యానికి బానిసయ్యాడు. దంపతుల మధ్య గొడవ జరగడంతో కనకవ్వ అత్తామామల వద్ద ఉంటుంది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు.

గృహిణి ఆత్మహత్య కేసులో.. యువకుడి అరెస్ట్


నిందితుడిని చూపుతున్న ఎస్ఐ

మర్కూక్(గజ్వేల్): వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకోగా, అందుకు కారణమైన యువకుడిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ప్రియాంక(24) అదే గ్రామానికి చెందిన కుంట భాస్కర్ మానసికంగా వేధిస్తున్నాడని పది రోజుల కిందట ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పటి నుంచి పరారీలో ఉన్న భాస్కర్‌ను ఎస్ఐ దామోదర్ తన బృందంతో కలిసి ఎర్రవల్లిలోని అతడి నివాసంలో అదుపులోకి తీసుకొని గజ్వేల్ కోర్టులో హాజరు పర్చారు.

జనగణనలోనే కులగణన చేపట్టాలి : నందగోపాల్

మెదక్ మున్సిపాలిటీ: జనగణనలోనే కులగణన కూడా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ నందగోపాల్ డిమాండ్ చేశారు. 25న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించే సమరభేరి పోస్టర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘం కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు రూపొందించాలన్నారు. బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించేందుకు బీసీ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్, రక్షక దళ ఛైర్మన్ ఉదయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

తొగుట(దుబ్బాక): మండలం లక్ష్మాపూర్‌కు చెందిన పిట్ల రాజుపై జరిగిన హత్యాయత్నం ఘటనలో మరో ఇద్దరిని మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్ద మాసాన్‌పల్లి మదిర ఇందిరానగర్‌కు చెందిన కడారి సాగర్‌తోపాటు మరొకరిని సీఐ లతీఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం హైదరాబాద్‌లో పట్టుకొని విచారిస్తున్నట్టు సమాచారం. 11వ తేదీన రాజుపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో శనివారం ఆరుగురిని అరెస్టు చేసి రిమాండుకు పంపించిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెల్మ స్వామితోపాటు రాంపురానికి చెందిన జంగిటి భిక్షపతి పరారీలో ఉన్నారు.

వైద్యులు సూచించిన మాత్రలే వాడాలి


వర్గల్(గజ్వేల్): వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్

- డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్ కుమార్
- ములుగు, వర్గల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ

ములుగు(గజ్వేల్) : ప్రజలు వైద్యులు సూచించిన యాంటీబయాటిక్స్ మాత్రలనే తీసుకోవాలని, అనవసరమైన మందులు వాడొద్దని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్ సూచించారు. మంగళవారం ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న రక్తపరీక్ష నమూనాలను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందికి, ప్రజలందరికి వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యులకు సూచించారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వర్క్‌షాపు, ప్రతిజ్ఞ చేయించడం, యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ గురించి చర్చ, పాఠశాలలు, కళాశాలల్లో పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెల 25కు తగ్గకుండా సాధారణ ప్రసవాలు నిర్వహించడంతోపాటు ఐపీ, ఓపీ సంఖ్యను పెంచాలని, తల్లి, బిడ్డల సంక్షేమ కార్యక్రమాల పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఉపయోగించే మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ వైద్యాధికారి దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు జరిగేలా చూడండి

వర్గల్(గజ్వేల్): ప్రభుత్వాసుపత్రులల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన వర్గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ల్యాబ్, ఫార్మసీ రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవల తీరును రోగులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా వైద్యులు, సిబ్బంది పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 'యాంటీబయాటిక్' మందులను అనవసరంగా వాడకూడదని, ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరగాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆసుపత్రి కొత్త భవన నిర్మాణపనుల పురోగతి పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ మేరీ మీనాకుమారి, డాక్టర్ శిరీష, సీహెచ్ఓ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్ర లేఖనం, కథల పోటీల్లో ప్రతిభ


పతకాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్ర లేఖన, కథల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభచాటారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని తెలుగు రాష్ట్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థి శ్రీనిధి చిత్రలేఖనలో, 8వ తరగతి విద్యార్థి దీక్షిత కథల పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరికి ప్రశంసాపత్రంతోపాటు నగదు పారితోషకాన్ని నిర్వాహకులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు జగదీశ్వర్‌ను హెచ్ఎం మానువాడ సరళ అభినందించారు.

ఆర్ట్ పోటీల్లో విద్యార్థుల సత్తా

వెల్దుర్తి(తూప్రాన్): రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ఆర్ట్ కాంపిటీషన్ ముంబయి నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్ట్ కాంపిటేషన్‌లో వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ చాటారు. పోటీల్లో పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు పాల్గొనగా, వివిధ కేటగిరీలో ఎనిమిది గోల్డ్ మెడల్స్, ఐదు సిల్వర్, ఐదు మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు హెచ్ఎం సాంబయ్య పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు విద్యార్థులకు ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు జయసుధను మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, నర్సింహారెడ్డి, చార్లెస్, అర్చన, నవనీత, అమూల్య, సునీత, శైలజ, వాణిశ్రీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు..

గజ్వేల్‌రూరల్: జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఆర్‌అండ్ఆర్ కాలనీకి చెందిన విద్యార్థిని పవిత్ర ఎంపికై నట్లు ఆ పాఠశాల పీడీ ప్రశాంత్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్ఆర్ కాలనీలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని ఇటీవల చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించి అద్భుతమైన ఆటతీరును కనబర్చిందన్నారు. డిసెంబర్ 10న ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరుగనున్న అండర్–14 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కరీమొద్దీన్‌తో పాటు ఉపాధ్యాయులు పవిత్రను అభినందించారు.

వరి కోత మిషన్ దగ్ధం


మంటల్లో కాలిపోతున్న మిషన్

వర్గల్(గజ్వేల్): వరి కోస్తుండగా పొలంలో విద్యుత్ తీగలు తగిలి వరి కోత మిషన్ దగ్ధమైంది. ఈ ఘటన వర్గల్ మండలం వేలూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. వేలూరుకు చెందిన రైతు ఉప్పరి రామస్వామి మంగళవారం తమ గ్రామంలోని రాయన్న శ్రీశైలానికి చెందిన వరికోత మిషన్‌తో వంట కోయిస్తున్నాడు. పొలంలో వేలాడుతున్న కరెంటు తీగలను డ్రైవర్ గమనించకుండా ముందుకు నడిపించడంతో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. భారీగా మంటలు వ్యాపించి మిషన్ పూర్తిగా దగ్ధమై భారీ నష్టం వాటిల్లింది. కళ్లెదుటే యంత్రం బుగ్గిపాలు కావడంతో యజమాని శ్రీశైలం బోరుమన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


ప్రభాకర్(ఫైల్)


మహేశ్(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి ఫరీద్‌పూర్ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని జక్కన్నపేట గ్రామానికి చెందిన శీల ప్రభాకర్(25), మామిండ్ల మహేశ్(26) మంగళవారం రాత్రి పని నిమిత్తం మెదక్‌కు వచ్చారు. రాత్రి తిరిగి స్వగ్రామం జక్కన్నపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో ఫరీద్‌పూర్ మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందగా, మహేశ్‌ను మెదక్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని హవేళిఘణాపూర్ ఏఎస్ఐ రాజు తెలిపారు.

బైక్ పై నుంచి పడి మహిళ..

మర్కూక్(గజ్వేల్): ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతి చెందారు. మృతురాలి బంధువులు, పోలీసుల కథనం మేరకు.. గణేశ్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్ల పద్మావతి (49) కుమారుడు భాస్కర్‌తో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై గజ్వేల్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో ప్రమాదవశాత్తు పద్మావతి బైక్ పై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా మృతి చెందింది. మృతురాలి కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలి అవయవాలను ఇతరులకు దానం చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలు

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తూప్రాన్‌కు చెందిన నర్సింలు బైక్‌పై సోమవారం అర్ధరాత్రి మేడ్చల్ నుంచి తూప్రాన్‌కు వెళ్తున్నాడు. మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి శివారులోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఇదే సమయంలో మెదక్ నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్సం నిమిత్తం మేడ్చల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వం తీవ్ర జాప్యం


ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్

మాట్లాడుతున్న గోవిందు నరేశ్

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ అంశంలో జాప్యం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని కోలా అభిరామ్ గార్డెన్స్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకట స్వామి మాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి మాదిగలతో కలిసి గోవిందు నరేశ్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ముప్పై ఏళ్లపాటు అలుపెరగని పోరాటం చేసి సుప్రీంకోర్టు ద్వారా విజయం సాధిస్తే.. ఆ ఫలాలు మాదిగలకు అందకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో దేశంలో తమ ప్రభుత్వమే ముందుగా అమలు చేస్తుందని అసెంబ్లీలో ప్రకటించిన రేవంత్‌రెడ్డి మాలల ఒత్తిడికి తలొగ్గి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని విస్మరించారని ఆరోపించారు. 11,062 టీచర్ పోస్టుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేశారని మండిపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన హర్యానా ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అంతిమంగా న్యాయమే గెలుస్తుందని, మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పరుశరాములు, నాయకులు యాదగిరి, మైసరాములు, యాదగిరి, శ్రీనివాస్, రమేశ్, పవన్‌కల్యాణ్‌తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి ప్రాథమిక హక్కులు వర్తిస్తాయి




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్వాతిరెడ్డి

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తల్లిగర్భం నుంచే ప్రతీ ఒక్కరికి ప్రాథమిక హక్కులు వర్తిస్తాయని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, సాయి రమాదేవీల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వాతిరెడ్డి హాజరై మాట్లాడారు. రాజ్యాంగం చాలా గొప్పదని అందరూ తప్పకుండా తెలుసుకోవాలన్నారు. ఒక చట్టం అమలు కావాలంటే గవర్నమెంట్ నుంచి జీవోలు పాస్ అవ్వాలని చెప్పారు. 18 ఏళ్లలోపు ప్రేమించడం, ప్రేమించి పెళ్లి చేసుకోవడం తప్పన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు


విఠల్ చనిపోయాడని చూపుతున్న బాధితులు

నర్సాపూర్: చనిపోయిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన నర్సాపూర్‌లో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. బాధితులు లంబాడి దేవీ సింగ్, మృతుని కుమారుడు ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని 200 సర్వే నంబరులో తమ నలుగురి తాతల పేరు మీద మూడెకరాల ఐదు గుంటల భూమి ఉంది. ఇందులో ముగ్గురి తాతల పిల్లలు తమ వంతు వాటా అమ్ముకోగా, మేము మాత్రం విక్రయించలేదు. ఈ క్రమంలో తమ దాయాదుల వద్ద శ్రీనివాస్ అనే వ్యక్తి భూమిని కొనుగోలు చేశారు. మా తాతకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్ భూమిని కొనుగోలు చేసిన శ్రీనివాస్‌కు పట్టా చేశారని, ఆ భూమిని నాలా కింద మార్పు చేశారని వాపోయారు. ఈ విషయంలో కొంత కాలంగా గొడవ జరుగుతుంది. దీనిలో భాగంగా శ్రీనివాస్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇందులో లంబాడి దేవిసింగ్‌తోపాటు తండ్రి సూర్య, అతడి చిన్నాన్న విఠల్(చనిపోయిన వ్యక్తి), విఠల్ కుమారుడు ఆంజనేయులుపై 23 సెప్టెంబర్ 2024లో నర్సాపూర్ ఎస్ఐ లింగం కేసు నమోదు చేశారు. కాగా విఠల్ 26–02–2018లోనే చనిపోయాడు. చనిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తమకు ఎఫ్ఐఆర్ కాపీ అందచేశారని దేవీసింగ్ ఆరోపించారు. ఆరేళ్ల కిందట చనిపోయిన విఠల్‌పై కేసు నమోదు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాం: ఎస్ఐ లింగం

తమకు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అందులో ఉన్న అందరి పేర్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశాం. కేసు విచారణ చేసిన అనంతరం చనిపోయిన వ్యక్తులు ఉంటే వారి పేర్లు తొలగించి గొడవకు బాధ్యులైన వారిని చార్జిషీట్‌లో చేరుస్తాం.